## క్లుప్తంగా

### ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన నామాల వెంకట సుబ్బయ్య, ఈశ్వరమ్మ దంపతులు రూ.25 వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వర రెడ్డికి దాతలు నగదు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఘనంగా బసవజయంతి

బనగానపల్లెరూరల్: మండలంలోని పసుపలలోని వీరభద్రస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో శ్రీబసవేశ్వరుడి 892వ జయంతిని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడి చిత్ర పటానికి పూజలు చేసి, అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగాయత్ సంఘం గురువు గంగధరయ్య, సభ్యులు రాజశ్వరప్ప, శేఖర్, రాజశ్వరప్ప పాల్గొన్నారు.

### వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

### ఘనంగా జ్యోతుల మహోత్సవం



చౌడేశ్వరీదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడులో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం జ్యోతుల మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన తనయుడు కాటసాని ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు దుత్తల చిన్న నరసింహారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఓబుళరెడ్డి, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

### మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారి పక్కనే హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌రెడ్డి, వాల్మీకి సంఘం నాయకుడు టీసీ వెంకట్రాముడు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

కోవెలకుంట్ల: 2023–24 విద్యా సంవత్సరానికి గురుకులాల్లో ప్రవేశానికి ఆదివారం పట్టణ శివారులోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 5వ తరగతి, మధ్యాహ్నం ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి రాత పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఫిర్దౌస్ అంజుమ్ తెలిపారు. వేసవికాలం కావడంతో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు మంచినీటితోపాటు అన్ని వసతులు ఏర్పాటు చేశారు.

### నరసింహస్వామికి పూజలు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ లో వెలసిన గట్ల నరసింహస్వామి ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా స్వామివారు చందనోత్సవ అలకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో లక్ష్మీసమేత గట్ల నరసింహస్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### నేడు మండల సమావేశం

డోన్ టౌన్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల పరిషత్ సమావేశ భవనంలో మధ్యాహ్నం 3గంటల నుంచి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది రంగాల్లో ప్రగతి సాధించిన గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులను ఎంపీపీ చేత సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీలు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

# బంగినపల్లి... భలే మధురం!

- మొదలైన మామిడి పండ్ల సీజన్
- అందరి చూపు బంగినపల్లి బేనిసా వైపే
- మే మొదటి వారం నుంచి ఊపందుకోనున్న కొనుగోళ్లు
- ఆశాజనకంగా దిగుబడులు... అందుబాటులో ధరలు



బనగానపల్లె: అందరూ ఇష్టపడే మామిడి పండ్ల సీజన్ వచ్చేసింది. దాదాపు రెండువారాల నుంచి అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఎంతో ప్రసిద్ధి చెందిన బంగినపల్లి(బనగానపల్లె) బెనిసా కూడా మార్కెట్‌లోకి వచ్చేసింది. ప్రపంచ వ్యాప్తంగా బంగినపల్లి బేనిషాకు మంచి పేరు ఉంది. మామిడి పండ్లలలో బేనిషాను రాజుగాను, మల్లువను మంత్రిగాను, దీల్‌పసన్‌ను సేనానిగాను వర్ణిస్తుంటారు జనం. మూడు నెలల పాటు మార్కెట్‌లో బేనిషాన్ మామిడి తప్పా ఇతర పండ్లు నామ మాత్రంగా అగుపిస్తుంటాయి. ఈ సీజన్‌లో బంగినపల్లి(బనగానపల్లె) బెనిసా రుచి చూడనివారు దాదాపు ఉండరు. ఈ ప్రాంతం ప్రజలు బంధువులు, స్నేహితులకు బెనిసాను పంపడం ఆనవాయితీ. మామిడి పండ్ల సీజన్ వచ్చిందంటే ఈ పండ్ల కోసం ఎదురు చూస్తుంటారు ఈ ప్రాంతం ఆడపడుచులు. ఇక్కడ విధులు నిర్వర్తించి వెళ్లిన అధికారులు సైతం ఆశతో ఉంటారు. వందల ప్రకారం బేనిసా పండ్లను కొనుగోలు చేస్తుంటారు ప్రజలు. వాస్తవానికి పేరుకు తగ్గట్టే ధరలు కూడా ఎక్కువే. అయినా ఈ పండ్లను కొనుగోలు చేయాల్సిందే అన్నట్టుగా ఉంటుంది పరిస్థితి. అయితే ఈ ఏడాది దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉండడంతో ధరలు అనుకూలంగా ఉంటాయంటున్నారు వ్యాపారులు. గతేడాది వంద మామిడి పండ్ల రూ.5–6వేలు ఉండగా ఈఏడు రూ.4–5వేలు ఉంటాయని వ్యాపారుల అంచనా. మామిడి రైతులు ఆశించిన్నట్లే ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించి పూత పిందె బాగా నిలిచింది. చెట్ల నిండా కాయలు మెరుస్తున్నాయి. అయితే అకాల వర్షాలు శాపంగా మారే అవకాశం లేకపోలేదు. వాస్తవానికి మే మొదటి వారం నుంచి బంగినపల్లి బేనిషా కొనుగోళ్లు ఊపందుకుంటాయి.

**నవాబుల కాలం నుంచే ప్రత్యేకత...**

బనగానపల్లె సంస్థానాన్ని వందేళ్ల క్రితం నవాబులు పరిపాలించిన కాలం నుంచే బంగినపల్లి బేనిసాకు ఓ ప్రత్యేకత ఉంది. అప్పట్లో బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో సుమారు వేయ్యి ఎకరాల్లో మామిడితోటలు పెంచినట్లు ప్రతీతి. వీటీ పెంపకానికి నవాబులు ప్రత్యేకంగా సాగునీటి వనరులు కల్పించి తోట మాలులను ఏర్పాటు చేసినట్లు ప్రచారం ఉంది. మామిడి తోటల ద్వారా వచ్చే ఆదాయం ఖజానకు ఉపయోగపడేదనే నానుడి ఉంది. ఇక్కడ పండిన బేనిషా మామిడి తోలు పలుచగా ఉండి, విత్తనం వరకు తీపుగా ఉంటుంది. పండు మాగినా పది రోజుల వరకు కూడా చెడిపోవు. కాలానుగుణంగా సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ వీటికి ఉన్న డిమాండ్ మాత్రం ఏ మాత్రం తగ్గలేదు. అప్పటికీ... ఇప్పటికీ భలే మధురం అనే పేరు ఉంది బంగినపల్లె బెనిసాకు. విదేశాలకు సైతం ఎగుమతి అవుతుంది బంగినపల్లి బెనిసా.

### అందరికీ అందుబాటులో మామిడి ధర



ఈ సంవత్సరం మామిడి పండ్ల ధరలు అందుబాటులో ఉన్నాయి. రెండువారాల కిందట బేనిషాన్ మామిడి పండ్ల విక్రయాలు మొదలయ్యాయి. మామిడి పండ్ల దిగుబడి ఆశాజనకంగా ఉంది. దీంతో కొనుగోలుదారుకులకు ధరలు అనుకూలంగానే ఉన్నాయి. వ్యాపారులకు గిట్టుబాటు అవుతుంది.

– సజ్జాద్‌హుస్సేన్, కొనుగోలుదారుడు, బనగానపల్లె

### వాతావరణం అనుకూలించింది



ఈ ఏడాది మామిడి పంటకు వాతావరణం అనుకూలించింది. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో వర్షాలులేనందున పొడి వాతావరణం మూలంగా పూత నిలబడి పంటబాగా కాసింది. నాణ్యతకు బంగినపల్లి బేనిషాన్ పేరుగాంచింది. వ్యాపారులకు మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది.

–రఘువరన్, హార్టికల్చర్ అధికారి, బనగానపల్లె

### ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

డోన్ టౌన్: గురుకుల పాఠశాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణ సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉదయం 5వ తరగతికి ప్రవేశ పరీక్ష నిర్వహించగా703 మంది, మధ్యాహ్నం ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ప్రవేశ పరీక్షలు నిర్వహించగా 378 మంది హాజరయ్యారని ప్రిన్స్‌పాల్ గీత తెలిపారు. ఈ పరీక్షలకు దిన్నేదేవరపాడు గురుకుల పాఠశాల లెక్చరర్ రాజ్యలక్ష్మి చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు.

### రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా ఇల్లూరుకొత్తపేట

బనగానపల్లె: రాష్ట్రస్థాయిలో బనగానపల్లె మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామ పంచాయతీ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికైనట్లు ఎంపీడీఓ శివరామయ్య ఆదివారం తెలిపారు. అదే విధంగా ఉమ్మడి జిల్లాల్లో 21 గ్రామ పంచాయతీలు ఉత్తమ గ్రామ పంచాయతీలు ఎన్నికకాగా బనగానపల్లె మండలంలోనే ఐదు గ్రామ పంచాయతీలు ఒక్కోక్క విభాగంలో ఎన్నికయ్యాయన్నారు. ఇందులో బనగానపల్లె గ్రామ పంచాయతీకి రెండు అవార్డులురాగా రామక్రిష్టాపురం, పలుకూరు, ఇల్లురుకొత్తపేట గ్రామ పంచాయతీలు ఎంపికైన వాటిలో ఉన్నాయన్నారు. ప్రధానంగా ప్రభుత్వ అభివృద్ధి పథకాల అమలు, గ్రామాల పరిశుభ్రత ఇతర అన్నిరంగాల్లో అభివృద్ధిని పరిగణలోకి తీసుకొని వీటిని ఎంపిక చేయడం జరిగింది. ఒకే మారు మండలంలో ఐదు గ్రామ పంచాయతీలు ఎంపికకావడంతోపాటు రాష్ట్రస్థాయిలోనూ ఎంపిక ఇదే ప్రథమమని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు.

## అభివృద్ధిని చూసే వైఎస్సార్‌సీపీలోకి వలసలు



పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి చాలా మంది పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఆదివారం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో కల్వటాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కామిని తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు తలారి చిన్న నాగన్న, నాగేంద్ర, లక్ష్మినారాయణ, శివయ్య, రామకృష్ణారెడ్డి కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ఆహ్వానించారు. కాటసాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. నిత్యం ప్రజల కోసం అహర్నిశలు కష్టపడే మనస్తత్వం ఉన్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకునేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం



షేక్స్‌పియర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



వంద సూత్రాలు పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

కోవెలకుంట్ల: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఉసేనయ్య ఆధ్వర్యంలో ప్రపంచ ప్రఖ్యాత రచయిత విలియం షేక్స్‌పియర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. షేక్స్‌పియర్ పుట్టిన రోజును ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని హెచ్‌ఎం గుర్తు చేశారు. ప్రపంచంలోని అన్ని విషయాలను పుస్తకాలు చదవడం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుగుణ, నీరజ, వరలక్ష్మ, జహిరాబీ, ప్రసాద్, శ్రీపతి, శివశంకర్‌రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. పుస్తక నేస్తం చేయడం వలన వారిలో విజ్ఞానం పెంపొందుంతుందని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. అనంతరం సభకు వచ్చి వారికి వంద సూత్రాలు అనే పుస్తకాలను ఉచితం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలసరస్వతీ భజన మండలి అధ్యక్షులు బాలహనుమంతు, శ్రీనివాసగౌడ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: మనోవికాసానికి మంచి మార్గదర్శి పుస్తకం అని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం పాతపేట హైస్కూల్లో విద్యార్థులకు పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. చేతిలో చిల్లిగవ్వ లేక పోయిన విజ్ఞాన సంపన్నునిగా మార్చేది పుస్తకం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటేశ్వరగౌడ్, వెంకటలక్ష్మీ, లక్ష్మయ్య, మధుసూదనరెడ్డి, భూకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే చల్లా కుటుంబం లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, చిత్రంలో చల్లా కుటుంబ సభ్యులు

- ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: దివంగత నేత చల్లా రామకృష్ణారెడ్డి ఆశయ సాధన దిశగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చల్లా కుటుంబం ముందుకు సాగుతుందని ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి దివంగత ఎమ్మెల్యే చల్లా రామకృష్ణారెడ్డి ఎంతో కృషి చేశారని, రాష్ట్రంలోనే అవుకు మండలానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారని గుర్తు చేశారు. స్థానిక చల్లా కార్యాలయంలో ఆదివారం అవుకు గ్రామ పెద్దలు, గ్రామ సంఘం నాయకులతో వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, అవుకు సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్ర నాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి ఎంపీపీ సమావేశమయ్యారు. అవుకు రిజర్వాయర్ ఉన్నప్పటికీ పంట కాలువలు, ఆయకట్టు రహదారులు లేనందున రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అవుకు గ్రామ పెద్దలు, గ్రామ సంఘం నాయకులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీపీ మా అన్న దివంగత చల్లా రామకృష్ణారెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఆయకట్టు రహదారులకు సంబంధించి నివేదికలు పంపించారని, అయితే ఆయన మరణంతో పెండింగ్‌లో పడ్డాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే తాము కూడా ఇక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. అవుకు మండల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సమానమని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తాము ముందుంటామని, ప్రజలు కలిసి మెలిసి ఉండాలని, ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. అలాగే మే 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవుకు తిరునాలను ఐకమత్యంగా చేసుకోవాలని, తమవంతు సహకారం ఉంటుందన్నారు. మా నాన్న దివంగత చల్లా రామకృష్ణారెడ్డి అవుకు ప్రజలకు ఇచ్చిన మాట మేరకు వచ్చే ఏడాది తిరునాల సమయానికి నూతనంగా రూ.30 లక్షలతో తేరును తయారు చేయిస్తామని, అందులోనే ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరుగుతుందని ఈ సందర్భంగా చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మద్దయ్య, బొజ్జలన్న, దశరథుడు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, యువసంఘం అధ్యక్షుడు మల్లెల సునీల్, తల్లం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవీ మాత ఆలయం శతాబ్ది వేడుకలు

- తరలివచ్చిన ఆర్యవైశ్యులు
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల



హోమం నిర్వహిస్తున్న దృశ్యం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి



ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యాకపరమేశ్వరి దేవి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటలో వెలసిన వాసవీ కన్యాకపరమేశ్వరి దేవి ఆలయ శతాబ్ది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయం నిర్మించి వందేళ్లు పూర్తి చేసుకోవడంతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. మండలంలోని గ్రామాలతో పాటు నంద్యాల, అనంతపురం, వైఎస్ఆర్ కడప జిల్లా తదితర ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. వేదపండితులు గిరినాథశర్మ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం వాసవీ మాతను ప్రత్యేకంగా అలంకరించి ప్రాత:కాల పూజ, వేదపారాయణాలు, ప్రతిష్ఠాంగా హోమాలు, చండీ హోమం నిర్వహించారు. దాతల సహకారంతో గాలి గోపురం,శిఖర ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ ఆలయానికి ఆర్యవైశ్యులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తదనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కిషోర్ శర్మ ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్‌ను శాలువాలతో సన్మానించారు. దాతల సహకారంతో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక పల్లకీలో మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన కోలాట కళాకారుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహాదారుడు సుధాకర్ శ్రేష్ఠి, అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి హరిబాబు, కోశాధికారి శేషఫణి, ఉపకార్యదర్శి సూరి, కార్యవర్గ సభ్యులు బాలు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

### యువకుల మధ్య ఘర్షణ

డోన్ టౌన్: ఎల్‌బీసీ కార్యాలయం ఎదుట ఉన్న కేఈ మాదన్ననగర్‌లో ఆదివారం రాత్రి రెండు వర్గాల యువకుల మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఎందుకు ఘర్షణ జరిగింది అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

### మహిళపై దాడి

డోన్ టౌన్: పట్టణంలోని కొత్తపేటకు చెందిన రమణమ్మపై ఆదివారం దాడి జరిగింది. ఎరుకల విజయ్ అనే వ్యక్తి అకారణంగా తన ఇంటి దగ్గరకు వచ్చి దాడి చేశాడని బాధితురాలు ఆరోపించింది. ఈ మేరకు డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు తీసుకుంటుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### గుండెపోటుతో యువకుడి మృతి

డోన్ టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన కార్తీక్ (25)అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చి గేట్ల సమీపంలో ఆకస్మాత్తుగా పడిపోగా ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

### సమస్యల పరిష్కారమే లక్ష్యం



పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోర్లగుట్ట సమీపాన ఉన్న రజకులు బట్టలు ఉతికే నీటికుంట పూడికతో నిండిపోవడంతో సమస్యను ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీపీ ఆదివారం ప్రొక్లైన్ ఏర్పాటు చేయించి నీటికుంటలో పూడికతీత పనులు చేయించారు. అక్కడే ఉండి పనులను పరిశీలించారు. సమస్య పరిష్కారం కావడంతో రజకులతోపాటు గ్రామస్తులు, సర్పంచ్ బూషి మాదక్క ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని, ప్రాధాన్యత మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఈ సందర్భంగా ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు చలపతిరెడ్డి, వెంకిరెడ్డి, బాల వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## శరవేగంగా రహదారి పనులు



హెచ్ కొట్టాల గ్రామం వరకు చేపట్టిన నాల్గులైన్ల రహదారి నిర్మాణ పనులు

బేతంచెర్ల: పట్టణం లోని డోన్ క్రాస్ రోడ్డు నుంచి హెచ్ కొట్టాల క్రాస్ రోడ్డు వరకు 3.5 కిలోమీటర్ల మేర నాల్గులైన్ల రహదారి నిర్మాణానికి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సంబంధిత కంట్రాక్టర్ పనులు చేపట్టడంతో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈరహదారి పనులు పూర్తయితే బేతంచెర్ల నుంచి హెచ్ కొట్టాల వరకు రహదారికి ఇరువైపులా ఉన్న పరిశ్రమలకు వెళ్లే వాహనదారులు, ఆయా గ్రామాల వాహనదారుల రాకపోకలకు సౌకర్యంగా మారనుంది.

## శరవేగంగా వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం



వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం చేపడుతున్న దృశ్యం



నిర్మాణంలో ఉన్న వసతి భవనం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో కొత్తగా మంజూరైన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, వసతి గృహాలతో పాటు షెఫ్పర్డ్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ శివారులో రూ. రూ. 8 కోట్లతో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలను నిర్మిస్తున్నారు. రూ. 5 కోట్లతో షెఫ్పర్డ్ ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు. వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో అన్ని సౌకర్యాలతో కూడిన తరగతి భవనాలతో పాటు విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలు నిర్మిస్తున్నారు. అలాగే షెఫ్పర్డ్ ట్రైనింగ్ సెంటర్‌కు వచ్చే గొర్రెల పెంపకందారులకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లతో కూడిన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇటీవలే మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆయా భవనాల నిర్మాణ పనులు పరిశీలించారు. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించడంతో ఆ మేరకు పనులు వేగవంతంగా సాగుతున్నాయి.



నిర్మాణ దశలో ఉన్న గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం